క్లుప్తంగా

వొకేషనల్ విద్యపై ఆసక్తి పెంచుకోవాలి


ఎకౌంట్ ఓపెన్ చేయిస్తున్న బ్యాంక్ సిబ్బంది

తాళ్లూరు: విద్యార్థులు చదువుతో పాటు వొకేషనల్ విద్యపై ఆసక్తి పెంచుకోవాలని హెచ్ఎం వైఎస్ఆర్‌కే ప్రసాద్, వొకేషనల్ ఉపాధ్యాయుడు వై.అంజిబాబు అన్నారు. మండలంలోని తూర్పుగంగవరం హైస్కూల్లో బీఎఫ్ఎస్ఐ కోర్సు తీసుకున్న 9, 10వ తరగతి విద్యార్థులకు సోమవారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో జీరో ఎకౌంట్ ఓపెన్ చేయించినట్లు తెలిపారు. యూనియన్ బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీ ఉద్యోగికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: స్థానిక ఎమ్మార్సీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తూ అనారోగ్యానికి గురైన యోసోబుకు కొత్తపల్లి ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమారి, ఉపాధ్యాయుల సహకారంతో రూ.5,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ నగదును ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవిల చేతుల మీదుగా అందజేశారు. అనారోగ్యానికి గురై, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆయన్ను పరామర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు వాకా జనార్దన్‌రెడ్డి, నారాయణ, రెడ్డి నాయక్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక చేయూత


ఆర్థిక సాయం అందిస్తున్న తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి

పెద్దదోర్నాల: ఈతకు వెళ్లి మృత్యువాత పడిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ నెల 8వ తేదీన జమ్మిదోర్నాలకు చెందిన విద్యార్థులు పులుకూరి పవన్‌కుమార్ (14), పులుకూరి అద్భుతకుమార్ (16) ఈతకు వెళ్లి కుంటలో మునిగి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెల్సిందే. ఈ నేపథ్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పులుకూరి పవన్‌కుమార్ తల్లి రాకాటి, అబ్బుతకుమార్ తల్లిదండ్రులు పెద్దపోలయ్య, మేరీరాణిలకు చెరో 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

మరుగుదొడ్లు లేక అవస్థలు

- అత్యవసరానికి ఎటు వెళ్లాలి
- మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


పుల్లలచెరువు ఎంపీడీవో కార్యాలయం

పుల్లలచెరువు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిశుభ్రత, స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర అంటూ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడమే కాకుండా అధికారులు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. పరిశుభ్రతపై అంతలా ప్రచారం చేస్తున్న అధికారులు మండల కేంద్రంలో ప్రజలకు కనీస అవసరమైన సామాజిక మరుగుదొడ్లు నిర్మించే ఆలోచన చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరానికి ఎటు వెళ్లాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం, మూడు కార్యాలయాలకు నిలయమైన ఎంపీడీవో కార్యాలయం, ఏవో కార్యాలయం, వీటితో పాటు రెండు బ్యాంకులు, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు రోజూ వివిధ పనులపై గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. వారు మరుగుదొడ్లు లేక కాలకృత్యాలు తీర్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు మాత్రం తమ కార్యాలయాల్లో మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. జనం కోసం సామాజిక మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు నిర్మించాలనే ఆలోచన చేయకపోవడం శోచనీయం.

ఉగ్గ పట్టుకోవాల్సిందే

వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే అరుబయటకు వెళ్లాల్సి వస్తే మళ్లీ ఇంటికి వెళ్లే వరకు ఉగ్గ పట్టుకోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో సిబ్బందితో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సామాజిక మరగుదొడ్లు నిర్మించాలి



పరిశుభ్రత గురించి ప్రచారం నిర్వహించే అధికారులు వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారు. సామాజిక మరుగుదొడ్లు లేక పోవడంతో ప్రజలు, కార్యాలయానికి వచ్చే సిబ్బంది పడే ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాల్లో ప్రజల కోసం కూడా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. అలానే మండల కేంద్రంలో సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జి.గురునాథం, సీపీఐ కార్యదర్శి, పుల్లలచెరువు

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

దొనకొండ (కురిచేడు): దొనకొండ మండలం యర్రబాలెం, బాదాపురం గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పల్లె పల్లెలో అర్హులైన పింఛనుదారుల పింఛన్లు తొలగించారని మండిపడ్డారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి మొబైల్ ద్వారా బాబు మోసాలు తెలియజేసే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, జిల్లా యాక్టివిటీ సభ్యుడు బత్తుల వెంకట సుబ్బయ్య, మాజీ జెడ్పీటీసీ గుంటు జాకోబ్, నియోజక వర్గ బూతు కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటు పోలయ్య, మండల యూత్ కన్వీనర్ వడ్లమూడి బుజ్జి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు వల్లభ రామారావు, ఎంపీటీసీలు తాలూరి లక్ష్మీ నగేష్, కసిబిసి నాగరాజు, మాజీ సర్పంచ్ రామగిరి హుసేన్, నాయకులు సయ్యద్ ముజాయిద్, షేక్ రసూల్, రహంతుల్లా, కిన్నెర ప్రసాద్, మోడిబాలయ్య, నూనె రవికుమార్, వెంకట్రామయ్య, ఎం.చిన్న మల్లయ్య, చింతంగుంట నాగరాజు, గురవయ్య, బాలయ్య, దయ్యాల ఇస్మాయేలు, పులిమి గురవయ్య, గుడిపాటి నాసరయ్య, బాలయ్య, నారాయణ, మంచికంటి రామిరెడ్డి, శివారెడ్డి, మహేశ్వరరెడ్డి, నెంబరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కురిచేడు: పడమరనాయుడుపాలెంలో..

కురిచేడు: బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పడమర నాయుడుపాలెంలో మండల పార్టీ అధ్యక్షుడు యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ 6 హామీలను గాలికొదిలేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల వివరాలు క్యూర్ కోడ్ ద్వారా ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో లెక్కకు మించిన హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. 14 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. రెడ్ బుక్ రాజ్యాంగం మాటున రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి షేక్ సైదా, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మకాయల రాజయ్య, సర్పంచ్ బొమ్మనబోయిన మహేష్, సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్ కుమార్, మాజీ జెడ్పీటీసీ వరికూటి వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు బొమ్మనబోయిన ఆంజనేయులు, బొమ్మినీడు చెంచయ్య, షేక్ అల్లాభక్ష పాల్గొన్నారు.


దొనకొండ: క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజలు

బూచేపల్లి వెంకాయమ్మకు
పుట్టినరోజు శుభాకాంక్షలు


బూచేపల్లి వెంకాయమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న దుంపా రమణమ్మ, గౌరిసురేష్‌రెడ్డి

చీమకుర్తి: జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు సంతనూతలపాడు జెడ్పీటీసీ సభ్యురాలు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, రాష్ట్ర మహిళా జోనల్ అధ్యక్షురాలు, ఒంగోలు కార్పొరేటర్ ఎం.గౌరిసురేష్‌రెడ్డి సోమవారం ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చీమకుర్తిలోని బూచేపల్లి వెంకాయమ్మ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బస్ సౌకర్యం కల్పించాలని వినతి


ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని మంగమూరు, ఎనికపాడు గ్రామాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు సోమవారం ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రతిరోజూ వందలాదిమంది ప్రజలు పనుల నిమిత్తం ఒంగోలు వస్తుంటారని, కానీ, ఆర్టీసీ బస్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు, కాలేజీ విద్యార్థులు నిత్యం ఒంగోలు వస్తుంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించిందని, కానీ, గ్రామాలకు బస్‌లు రాకపోతే వారు ఆ సౌకర్యాన్ని ఉపయోగించుకోలేక పోతున్నారని తెలిపారు. దీనిపై ఆయా గ్రామాల్లో సంతకాలు సేకరించి వినతిపత్రం సమర్పించారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి ఆర్టీసీ ఆర్ఎంతో మాట్లాడి రూటును పరిశీలించి రెండు రోజుల్లో బస్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ మస్తాన్, టి.రాము, పి.సుబ్బారెడ్డి, ఎన్వీ నరసింహం, ఎం.శ్రీనివాసరావు, జే కోటేశ్వరరావు, టీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండర్లకు గుర్తింపు కార్డులివ్వాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఒంగోలు నగర స్ట్రీట్ వెండర్లు

ఒంగోలు సిటీ: నగరంలోని స్ట్రీట్ వెండర్లకు గుర్తింపు కార్డులివ్వాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.రమేష్ డిమాండ్ చేశారు. ఒంగోలు నగర స్ట్రీట్ వెండర్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవనం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ ఇచ్చిన కార్డులను రెన్యువల్ చేయాలన్నారు. నగరంలో అనేక రోజుల నుంచి గుర్తింపు కార్డులను రెన్యువల్ చేయడం లేదన్నారు. కొత్తగా కార్డులివ్వకుండా మెప్మా ఆఫీస్ ఆపివేయడం అన్యాయమన్నారు. కార్డు లేని కారణంగా ఆశీ కాంట్రాక్టర్లు స్ట్రీట్ వెండర్లను ఇబ్బందిపెడుతున్నారని, అదేవిధంగా పోలీసులు కూడా రోడ్డు మీద బండ్లు ఉంచకుండా కార్డులు లేనివారిని ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. కార్డు లేని కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వారికి కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. గతంలో స్ట్రీట్ వెండర్లను గ్రూపులుగా చేసి లోన్లు ఇవ్వటం జరిగిందని, మళ్లీ ఆ లోన్‌లు అందరికీ ఇప్పించి వారి వ్యాపారం కోసం తోడ్పడాలని కోరారు. అనంతరం ఒంగోలు మెప్మా పీడీకి అర్జీ అందించారు. కార్యక్రమంలో స్ట్రీట్ వెండర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం.లక్ష్మీనారాయణ, వంశీ, మాధవ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు


ఎస్పీతో ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సిటీ: ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు సోమవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని విలేజ్, వార్డు సెక్రటేరియట్‌లలో పనిచేస్తున్న మహిళా పోలీసుల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎస్పీ.. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో మహిళా పోలీసుల బదిలీల్లో జరుగుతున్న ఆలస్యాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా, బదిలీల్లో ఉన్న అవరోధాలను అతి త్వరలో తొలగించి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, ఒంగోలు నగర కార్యదర్శి షేక్ మగ్దుంషరీఫ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కోటేశ్వరమ్మ, సీహెచ్ శిరీష, ఎస్పీ కార్యాలయ ప్రతినిధి అశ్విని తదితరులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్నికల కమిషన్


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బీజేపీ అపహాస్యం చేస్తోందని, ఎన్నికల కమిషన్ మొత్తం బీజేపీ ఎన్నికల కమిషన్‌లా మారిపోయిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే సైదా అన్నారు. ఓట్ల దొంగ, సీట్ల దొంగ గద్దె దిగు అనే పేరుతో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు నగరంలో ర్యాలీ నిర్వహించగా, సైదా మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో 65 లక్షల ఓట్లను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరించి తొలగించిందన్నారు. ప్రతిపక్ష నేతలు, ప్రజా గళాల గొంతునొక్కడమే పనిగా బీజేపీ పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు


గ్రోమోర్‌లో ఎరువులు తనిఖీ చేస్తున్న అధికారులు

కురిచేడు: యూరియా ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే డీలర్లపై 6ఏ కేసులు నమోదు చెయ్యడంతో పాటు ఎరువుల లైసెన్సులు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్, తహసీల్దార్ జి.రజినికుమారి హెచ్చరించారు. స్థానిక మన గ్రోమోర్ సెంటర్‌ను సోమవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. తొలుత షాపులో భౌతిక నిల్వలకు, స్టాక్ రిజిస్టర్లలో నిల్వలు, డీబీటీ మిషన్‌లో నిల్వలు పరిశీలించారు. రైతులకు అవసరం మేరకు యూరియా ఇవ్వాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని చెప్పారు. దొరకట్లేదన్న అపోహతో పంట కాలానికి సరిపడా ఎరువులు ఒకేసారి కొనుక్కొని ఇంట్లో పెట్టుకోవడం తగదని సూచించారు. యూరియా ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాలు, డీలర్ల వద్ద అందుబాటులో ఉంటుందని తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, కురిచేడు వీఆర్వో పాల్గొన్నారు.

దేవాలయం భూమి స్వామి వారికే చెందాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని మన్నవారిపాలెంలోని సీతారామస్వామి దేవాలయం భూమి అన్యాక్రాంతం అయిందని, ఆ భూమి స్వామివారికి మాత్రమే చెందేలా చూడాలని సోమవారం ఒంగోలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు నిడమానూరు మాలకొండయ్య అర్జీ అందించారు. సీతారామస్వామి కైంకర్యాలు జరుపుటకు తమ పెద్దలు ఉమ్మడి కుటుంబం తరఫున 1952లో మండలంలోని గంగవరం గ్రామంలోని సర్వే నంబర్ 1237లో 0.98 ఎకరాల భూమిని స్వామివారి పేరున గిఫ్టుగా (నంబర్ 1069–1952, తేదీ 11.12.1952) రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అదేవిధంగా 24.08.1969న మండలంలోని ఎండ్లూరు సర్వే నంబర్ 345లో 3.50 ఎకరాల భూమిని స్వామివారి పేరున రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఆ భూమి ప్రస్తుతం అన్యాక్రాంతం అయిందని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని స్వామివారికే భూమి చెందేలా చూడాలని కోరారు.

వ్యానుతో పోలీసులను ఢీకొట్టిన దొంగ

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): కోడిగుడ్ల వాహనంతో పారిపోతున్న దొంగను పట్టుకునేందుకు వెళ్లిన సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఆ వాహనంతో దొంగ ఢీకొట్టాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చీమకుర్తి జవహర్ హాస్పిటల్ సమీపంలో కోడిగుడ్ల వ్యాన్ ఆపి డ్రైవర్ షాపులోకి వెళ్లిన సమయంలో ఓ గుర్తు తెలియని ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఆ వాహనాన్ని ఎత్తుకెళ్లాడు. ఆ వాహనం సంతనూతలపాడు వైపు వస్తుందని, పట్టుకోవాలని చీమకుర్తి పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం అందడంతో సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ వద్ద సదరు పోలీసులు ఆపడానికి ప్రయత్నించారు. కానీ, ఆ దొంగ వాహనం ఆపకుండా పరారయ్యే క్రమంలో హెడ్ కానిస్టేబుల్ షరీఫ్ అహ్మద్, కానిస్టేబుల్ నారాయణ రెడ్డిని ఢీకొట్టి వెళ్లిపోయాడు. వారిని ఒంగోలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా, సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు సోమవారం పరామర్శించారు. నిందితుడు ఒరిశాకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు.

నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బందులు

తాళ్లూరు: స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైబర్ నెట్‌వర్క్ సేవలు సక్రమంగా అందడం లేదు. చాలా రోజుల నుంచి నెట్ మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నిత్యం వివిధ రకాల వీడియో కాన్ఫరెన్స్‌లు జిల్లా స్థాయి అధికారులు నిర్వహిస్తుంటారు. వాటికి మండల అధికారులు హాజరయ్యేందుకు సోమవారం ఇతర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివిధ అవసరాల దృష్ట్యా కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫైబర్ నెట్ సమస్య తొలగిపోయేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మీ కోసం కార్యక్రమానికి పోటెత్తిన జనం


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, డీఆర్వో

ఒంగోలు సబర్బన్: స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పోటెత్తారు. వందల సంఖ్యలో క్యూ కట్టి సమస్యలపై కలెక్టర్, అధికారులకు వినతిపత్రాలు అందించారు. దివ్యాంగులు సైతం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి మీ కోసం కార్యక్రమానికి వచ్చి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్‌ఓ ఓబులేసు, ఇతర అధికారులకు అర్జీలు అందించారు. మండల, గ్రామ స్థాయిలోని సమస్యలను కూడా అక్కడి అధికారులు పరిష్కరించకుండా పదేపదే తిప్పుకుంటున్నారని జిల్లా అధికారుల దృష్టికి బాధితులు తీసుకొచ్చారు.